# బోడి బత్తె

'ఏమండీ'

.... .... .... ....

'ఆఁ, మిమ్మల్నే పిల్చేది'

'ఎంతకూ పల్కరు - ఏమనుకుంటున్నట్టు'

'ఏం, అన్నమయిందా చెప్పరాదూ, ఇదిగో ఇప్పుడే ఐదు నిముషా లన్నానా!' ఏమిటో తల వంచి రాసుకుంటున్న రంగారావు భార్య కమల పిలుస్తుంటే.

'ఇంత పొద్దెక్కింది. ముఖమైనా కడగలేదు. ఇవాళ యెవరో వస్తారు కాఫీ బెట్టమంటిరి గదా'.

'ఆఁఆఁ అవునుగదూ'.

'ఇంత మతిమరుపైతే యెట్లాగండీ బతకటం ? అస్తమానం మీరు, మీ పుస్తకాలు రాతలేనా, ఏమైనా ఇంటి సంగతులు జూచుకోవట మున్నదా ?'

'సరే గాని, సాధింపులకు వాయిదా వేసి, అసలు సంగతి జెప్పు కాఫీ అయిందా ?'

'ఇవాళ పాలది యెగ్గొట్టింది'

'ఇవాళనే యెగ్గొట్టిందీ ? ఇది కూడా పరీక్షనే వచ్చిందే ?'

'అసలు మీ పరీక్ష కాదు, యిదంతా నా పరీక్ష, నా కర్మం, వేళ కేది లేక పోయినా చూచే వాండ్లు నన్నంటారుగాని మిమ్మల్ని అనరు

గదా ? పాపం పక్కింటి వీరన్న అంటివారి వంటి సలహా యిస్తే మీ చెవికే యెక్కటం లేదు.'

C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No. 41
CUDDAPAH.

'ఏం. ఆ బోడి బత్తై విషయమేనా, దేవేరిగారి సిఫారసు.'

'సిఫారసేమిటండీ, సిఫారసు, ఇదేం కచేరి కాదుగా, యజమాన్ల చుట్టూ తిరిగి సిఫారసు లంటూ వంగి వంగి సలాములు గొట్టటానికి మీరు. దీంట్లో యెవరి వాళ్లో వరిగేదేమున్నదని ?'

'యెవరి వాళ్లో వొరగడమో ఏమోగాని నాకు మాత్రం నూరు రూపాయల క్షౌరం బోడి బత్తై పేర.'

'నూరు రూపాయలు చూచుకుంటారుగాని యిటువంటి నూర్లెన్నైనాయి, నెల కిరువై రూపాయి ల్చొప్పున, ఈ యేడేండ్ల బస్తీ సంసారంలో'.

ఏడేండ్ల పాల ఖర్చు ఇంచు మించు 1500 రూపాయలు, అంటే ధరలు పెరిగిన యీ పాడు కాలంలో 15 బర్లన్నమాట – 15 బర్లు, వాటి సంతానం పెద్ద మందకు మందై సమృద్ధిన పాలు, పెరుగు, మీగడ సముద్రాలు కండ్ల ముందాడినై – పెరిగిపోయిన, పెరిగిపోతున్న సంతానం ఈ సముద్రాల్లో ఈదులాడేది గదా అనుకున్నాడు.

"ఏమిటి తెగని ఆలోచనలో పడ్డారు, ఏదైనా కథా ? పాటా ? పద్యమా, లేకుంటే ఏదైనా కేసు విషయమా ?"

'కాదు కథ'

'ఏంకథ లండీ, చెప్పుకోరాని ఆడవాండ్ల విషయాలు, లేకుంటే ఏ అమ్మా యెంబడో పిచ్చెక్కినట్టు పడి, దాని చేత దవడ పండ్లూడ గొట్టించుకోకుండా బయటపడటం, ఇదీ అదీ గాకుంటే ఏ డబ్బుగలయ్య అంగరంగ వైభోగాలు, ఇష్టంలేని అమ్మాయిలను మోసగించి పతివ్రతా ధర్మం వాళ్ళ మెడ కంటగట్టి, జే జేలు పాడటం, ఇవేనా కథలు, రాయ దల్చుకుంటే యెన్ని సంగతుల్లేవు ఈ ప్రపంచంలో –'

'అదిగదిగో, ఉపన్యాసానికి లంకించుకున్నావు - మొన్న వచ్చిన మీ తమ్ముని పాఠమేనా వప్పగించేది ఇదంతా ? చదువుకున్నందుకు ఏ నౌకరో చేసుక బతక్క ఏమో సిద్ధాంతాలట, వాటికి జీవితాలను లంకె దగిలించినామని తిరుగుతూ, మావంటివాళ్ళ రాతలమీద దండెత్తుతారు. కూలీల విషయం. కుట్టుకుంకల విషయం రాయమని, రైతుల విషయం రప్పరాళ్ళ విషయాలు రాయాల్నట ![1] శాసించడాని కెవని కే మధికారం ? ఒకనికి కారం రుచైతే, ఇంకొకని కుప్పు రుచి !'

"అదిగో అంటూనే మీరూ అదే ధోరణిలో పడ్తున్నారు. దేనికైనా ఒక ఉద్దేశ్యం, ప్రయోజన ముంటేనే రాణిస్తుంది. రాసుకోండి మీ యిష్టం వచ్చినట్లు. ఎక్కడుండాల్సిన వక్కడుంటై. అసలు విషయం దారి తప్పింది- ఈ అపరమధ్యాన్నంలో ఎవడొస్తాడండీ మీ కాఫీకి ?"

"దేవేరిగారి కోపం వస్తున్నది - అసలు దారితప్పించింది తాము. 2 ఏండ్ల నుండి పాల పెరుక్క ఖర్చైన డబ్బు కిన్ని బర్లొచ్చేయి - వాటి సంతానం బెరిగేది. ఆ పాలు, ఆ బర్లు యెక్కడికి బోయినట్టు? నీళ్ళ పేరు బెట్టిన పాళ్లు, గంజికన్న నా కిష్టమైన పెరుగు, గబ్బు నెయ్యి మన పాల బడ్డది అన్న కథాక్రమములో చించుకుంటుంటే, నా మీదా, నా రాతలమీద దండెత్తి, ఇంత రభస పెంచిండి నీవు-"

దేవరవారి కిప్పటికైనా తెల్సివచ్చినందుకు సంతోషం. ఆలోచించు కున్నట్లు కథ సుఖాంతమేనా ?

'అవును' అన్నాడు, ఎన్నో దినాల నుండి ఈ విషయం లొంగట మంటే తెల్వకుండా విజయవంతంగా పోరాడిన సిపాయి-

ఇంటి పక్క వీధినున్న తన బంధువు దగ్గరున్న బర్రె సంగతులు; పూటకు 3 సేర్లు పాలిస్తుందని, నెయ్యి జిడ్డు యెంత పిండిబెట్టి కడిగినా పోదని, యేనుగున్నలంత దూడల్ని బెడ్తుందని, కొద్ది దినాల్లోనే యీనబో తున్నదనీ యెన్నో దినాలనుంచి కథలు కథలుగా జెప్తున్నాడు- ఈ కమ్మని కథల ప్రభావం కమలమీద బాగా పడ్డది. ఏనాటికైనా ఆ బర్రె తనదై తీరాల్నని ప్రతిజ్ఞ చేసింది. చివరకు లొంగటమంటె యెరగని రంగారావును

లోంగదీసి ఒప్పించుకున్నది. కాని డబ్బుదగ్గర వచ్చిపడ్డది సమస్య- ఒక్క సారే నూరు రూపాయలంటే పిల్లలాటా, యీ కరువు కాలంలో.

'నా దగ్గర అరవై రూపాయిలున్నై - అంతకుమించి ఒక్క చిల్లి గవ్వలేదు. అవైనా సాయంత్ర మిస్తా. నీ బట్ట యిష్టం, నీ యిష్టం' అన్నాడు.

'అయితే తక్కిన నలభై నే నిస్తాను. ఆ అరవై యిటు పడేయండి. ఇవాళనే పంపిస్తాను' అన్నది.

'నీ దగ్గర యింత డబ్బెక్కణ్ణుంచొచ్చింది నే నివ్వంది?' అన్నాడు అధికార పూర్వకంగా.

"ఏం దొంగతనం జెయ్యలేదులెండి. అంతమాత్రం డబ్బు ఆడ వాండ్ల దగ్గర ఉండకూడదేమో! అయితే, ప్రతిదానికి చేయిజాపట మెందుకని సామాను కిచ్చే డబ్బు పొదుపరితనం జేస్తే కొంత డబ్బు మిగిలింది. అవైనా నేను తినటం లేదుగా, మళ్ళీ మీ సంసారానికే బెడ్తున్నాను" అన్నది రుసరుసలాడ్తూ.

"అదిగో! ఊఁ అంటే ముక్కుమీదనే వుంటుంది. మీ తల్లి గారింటివాండ్లకు నేను సర్వదా కృతజ్ఞుణ్ణి. ఎందుకంటావా, ఇంత పొదుపరితనం నేర్పి, అడగకుండానే నీవంటి దాన్నిచ్చినందుకు, ఆర్థిక స్వాతంత్ర్యానికి అడ్డుదార్లు నిర్మించుకున్న నీ తెలివితేటల కివే నా జోహార్లు!"

మధ్యలోనే అందుకున్నది నవ్వుతూ, "ఇక చాల్లెండి, అడిగిన వరాలిచ్చేరు. ఇదికూడా చదివేరు సుమా," ఆ అరవై రూపాయలిట్లా పారెయ్యండి అన్నీ సరేగాని." కింద బడున్న తాళపు చేతులుతో డ్రాయర్ దీసి డబ్బు తీసుకున్నది.

"సర్చి వారంటు లేకుండా, ఇంట్లో జొరబడి నానా అడావిడి జేసే పోలీసు వ్యవహారం జ్ఞాపకానికి తెస్తున్నావు" అన్నాడో విధంగా మొహం పెట్టి.

# 2

బఱ్ఱె యింటికి వచ్చినొన్నాడు కమల అడావుడి ఇంతంతగాదు-15 దినాలైతే మా బఱ్ఱె పాలిస్తుంది. ఇక పాల వాడిక కెవరైనా చూచు కొమ్మని నిర్మొహమాటంగా చెప్పింది పాలవానికి- బఱ్ఱె యీనగానే పాలు మీగడ జుఱ్ఱొచ్చుగాని మొదటి దినాల్లో జున్నుతోనే తృప్తి పడాల్నని పిల్లలతో వాగ్దానం చేయించుకున్నది-ఇంటిల్లపాది బఱ్ఱెనుగూర్చి తియ్యని కలలు గంటున్నారు-వచ్చిన బఱ్ఱెకు పాత చెప్పు మెడకు గట్టించింది వీరన్న సలహా ప్రకారం.

'ఇదెక్కడి అలంకారం నూరు రూపాయిలు బెట్టి కొన్న బఱ్ఱెగదా పాతచెప్పు మెడకుగట్టి తిప్పుతున్నావేం కర్మం' అన్నాడు అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన రంగారావు.

'ఇది ఏ మహరాజుగారి ఏనుగో కాదులెండి, బాగా మేపి అలంక రించి వుంచితే మీవంటి పెద్ద లేనాటికైనా వూరేగే కలలు గనటానికి, వీలైతే పుణ్యానికే గొట్టెయ్యటానికి'

"నన్నే గనక యెవడన్నా వూరేగించి యేనుగు బహుమానమిస్తా నంటే, నీ పేరుజెప్పి బఱ్ఱెపడ్డనే బహుమాన మియ్యమంటా."

"నా పేరెందుకూ మధ్యన, ఏనుగు పోషించలేను బాబూ, బఱ్ఱె గొడ్డునిస్తే పాలైనా తాగుతామని చెప్పుకోక'.

"ఈ గొడ్డు ఏనుక్కు ఆకారంలోనేగా తక్కువ. పాలు ముందే మిస్తుందో ఏమోకాని, దేవేరిగారి కెప్పుడూ దాని సపర్యలతోనే సరి పోతున్నది-వేళకు తిండిప్రాప్తం కూడా తొలిగింది."

"ఇప్పుడు కష్టం పడ్తేనే ముందు సుఖం" ఎన్నడూలేని ఈ ఓర్పుకు ఎక్కడలేని సంతోషమయింది.

అనుకున్నట్లుగానే బఱ్ఱె యీనింది. కమల సంతోషం కట్టలు తెంచు కొని ప్రవహిస్తున్నది. కాని పుట్టినదూడ లేవలేనిదైంది. కాళ్ళకేదో తగి

లిందంట-వాతలు బెట్టాలన్నారంతా- జీవహింస అనే చింతన లేకుండా గంటె గాల్చించి అగ్ని సంస్కారం చేయించింది-పాలు దొరకక దిన దినం యమధర్మరాజుకు దరఖాస్తులమీద దరఖాస్తులు బంపుకుంటున్నది. త్వరగావచ్చి తీసుక పోవయ్యా మహానుభావా అని క్యూ సిస్టంలో నిలబడ్డ లాగా బాధపడుతున్నది. పీనుగై పోతున్న దూడ ఏనుగు గాకపోతుందా అన్న ఆశ కమలను వదలలేదు. నెమ్మదిగా తల్లి దగ్గరికి తీసుకపోయి పాలు గుడిపించే ప్రయత్నం చేసేదికాని లాభం లేకపోయింది. చివరకు దూడ తన కష్టాల్దీర్చుకున్నది.

అయ్యో అనుకున్నది కమల చచ్చిన దూడను జూస్తూ. అంతా సానుభూతి ప్రకటించినారు – పాపం బంగారంవంటి దూడ పాడై పోయిందే అని——

ఇంతటితో ఈ ఘట్టం ముగిసింది కాని పాలు తాగాలనుకున్న ఆశలు స్వర్గానికి గట్టిన వుట్టిలాగా అలాగే వుండిపోయినై – వీరన్న సలహా ప్రకారం మరుగుమందులు, చచ్చిన దూడ తోలొల్చి గడ్డిదూర్చి దూడవోలె తయారు చేయించటం వగైరా నానా అవస్థలూ పడ్తున్నది. ఈ కలికాలంలో మరుగు మందులకుగూడా పాటిదప్పుతున్నదని నిరాశపడ్డాడు వీరన్న – మనబర్రె ఇచ్చే పాలెట్లుంటాయో కండ్లారా చూతామనుకున్న పిల్లలంతా బర్రె చుట్టూ చేరేవాళ్ళు – ఆఫీసుపని త్వరగా తీర్చుకొని యెప్పటికప్పుడు బర్రె సంగతి అరుచుకోవటం నిత్యకృత్యమైంది రంగారావుకు——

"ముందుకుపోతే పొడుస్తుంది, వెనక్కు బోతే తంతుంది. దాణా ముందరబెడ్తే మాత్రం శుభ్రంగా భోంచేస్తుంది – ఒక్క పాలచుక్క గూడా రాల్చడంలేదు" అని చెప్పలేక బిక్కమొఖంతో చెప్పింది, అన్ని ఆశలూ అడియాసలైనాక——

చివరకు యెరుకలదాన్ని కొలుపుగూడా అడిగిందట, ఇంట్లోచేసిన సంస్కరణోపన్యాసాలన్నీ ఉట్టిమీద మూసిపెట్టి – ఏనాడో పల్లెటూళ్ళో చచ్చిన తాతమ్మ దయ్యమై పట్టిందంటే యెరకలావిడ సలహా ప్రకారం ముత్యాలమ్మకు బెట్టించినా లాభంలేకపోయింది.

ముత్యాలమ్మకు బెడ్తే కోరికలు దీరేటట్లుంటే ఈ యుద్ధాలు వగైరా యెందుకు ? ఊళ్ళో ముత్యాలమ్మను లేపితే శత్రురాజులు నిశ్శేషమైపోయే వారే– ఇన్ని దేవుళ్ళున్నా ఎదుటివాండ్లకు బానిసలుగానే వున్నాం– ఇవన్నీ యెప్పటి సంగతులోకాని ఈ గొడ్డు నెవరికైనా అమ్మిపెట్టమని చెప్పు, ఆ మహారాజు వీరన్నతో – పెద్ద గుఱ్ఱాన్ని మేపినట్లుగా యెవడు మేపుతాడీ గొడ్డును – ఈ పాడు కరువుకాలంలో."

ఈసారికైనా పాలివ్వక పోతుందా , కొన్నదాన్నెందు కమ్మాలె నన్నది – ఆ వచ్చే శుభకాలాని కెదురు చూస్తూ, కనబడని భవిష్యత్తులో విహరిస్తూ—

(1947)